

నల్లజర్లలో చికెన్, ఎగ్ మేళా

ప్రజాశక్తి-నల్లజర్ల



బర్డ్‌ఫ్లూపై సోషల్ మీడియాలో వచ్చే అసత్య కథనాలను నమ్మరాదని డాక్టర్ వాసు ప్రజలకు సూచించారు. నల్లజర్లలోని టిపిఎస్ సెంటర్ వద్ద వెంకటేశ్వర హేచరీస్ అండ్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లజర్ల ఫార్మ రైతుల ఆధ్వర్యంలో చికెన్, ఎగ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసు మాట్లాడారు. 70 డిగ్రీల సెంటీగ్రేట్ ఉష్ణోగ్రత వద్ద ఉడికించిన చికెన్ తినడం వల్ల ఎటువంటి హాని జరగదన్నారు. మానవ ఆరోగ్యానికి కావాల్సిన ప్రొటీన్స్, విటమిన్లు అన్నీ చికెన్‌లో పుష్కలంగా లభిస్తాయన్నారు. అనంతరం చికెన్‌తో తయారు చేసిన వంటకాలను అందజేశారు.

నిరాశాజనకంగా బడ్జెట్

- ప్రధాన సమస్యలు పట్టని ప్రభుత్వం
- అరకొర కేటాయింపులకే పరిమితం
- అభివృద్ధిని విస్మరించిన వైనం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం 2025-26 పూర్తి బడ్జెట్‌ను ఏపీ అసెంబ్లీ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ బడ్జెట్‌ను మంత్రి అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రవేశపెట్టారు. అయితే ఈ బడ్జెట్ మరోసారి జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసింది. జిల్లా అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా విదల్చకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్న వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా ఉంది. ధాన్యాగారంగా పేరు పొందింది. ఈ నేపథ్యంలో వ్యవసాయ రంగానికి, నీటిపారుదల రంగానికి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉన్నా ఆ ఊసే లేదు. కేవలం రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టడానికి భారీగా లెక్కలు చెప్పినప్పటికీ ఆశించిన స్థాయిలో ఖజానాలో సొమ్ములు లేవు. సంపద సృష్టిపై దృష్టి సారిస్తామని చెప్పినప్పటికీ 8 నెలలు గడిచిపోయినా ఉపాధి అవకాశాలు లేవు. భారీ బడ్జెట్లో భాగంగా రెవెన్యూ లోటును, ద్రవ్య లోటును పొందుపరిచారు. దీన్ని బట్టి ఈ లోటును పూడ్చడానికి ప్రజలపై భారీ ఎత్తున భారాలు మోపే అవకాశం కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాను విస్మరించిన వైనం

ఈ బడ్జెట్ కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు తగిన నిధులు కేటాయించకపోవడంతో ప్రజలు పెదవి విరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న సందర్భంలో ఈ బడ్జెట్‌పై జిల్లా వాసులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు గాని, సాగునీటి పారుదల రంగానికి గాని ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైనుకు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతీ బడ్జెట్‌లోనూ నిరాశే ఎదురయ్యింది. కొత్త ప్రభుత్వమైనా నిధులు కేటాయిస్తుందని ఆశించినా నిరాశే మిగిలింది. ముఖ్యమైన పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధికి కూడా కేటాయింపులు లేవు. కాకినాడ స్మార్ట్ సిటీ అభివృద్ధి ప్రస్తావనే రాలేదు. గోదావరి పుష్కరాలు త్వరలో జరగనున్నాయి. ఘాట్ల అభివృద్ధి రహదారుల విస్తరణ వంటి పనులకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించాల్సి ఉంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే తీసుకురాలేకపోవడం గమనార్హం. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు కొత్తగా ఏర్పాటు చేసినప్పటికీ అక్కడ సరైన వైద్య సదుపాయాలు అందుబాటులో లేవు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భవనాలు పూర్తిస్థాయిలో లేవు. వాటి అభివృద్ధి పై బడ్జెట్లో ఎటువంటి ప్రస్తావన కనిపించలేదు.



కీలక ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం గత 23 ఏళ్లగా ఎదురు చూస్తున్న పరిస్థితి. కేంద్ర ప్రభుత్వం దశలవారీగా రైల్వే బడ్జెట్‌లో మొత్తం రూ.1100 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. గత వైసిపి ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఎన్నికల్లో ఓట్లు వేయించుకున్న కూటమి ప్రభుత్వం ఈ రికార్డు ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ వాటా సొమ్ములు కేటాయిస్తుందని ప్రజలు ఎదురు చూశారు. కానీ బడ్జెట్లో ఆ ప్రస్తావనే రాలేదు. దాంతో నిరాశ తప్పలేదు.

పరిశ్రమలకు మొండి చేయి

కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వమైనా పరిశ్రమలు పూతమిస్తుందని, తద్వారా ఉపాధి లభిస్తుందని యువత ఎంతో ఆశిస్తున్నప్పటికీ ఈ బడ్జెట్ పరిశ్రమలకు మొండి చేయి చూపారని జిల్లాకి చెందిన నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లాకు బడ్జెట్ చేయి చూపడంతో పెదవి విరుస్తున్నారు. స్వయానా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో భాగంగా ఉన్న కాకినాడ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుపై బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం విస్మయకరమని పలువురు కూటమి ప్రభుత్వంపై విమర్శల గుప్పిస్తున్నారు. తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే జల్ జీవన్ మిషన్ పనులకు అరకొర నిధులను మాత్రమే కేటాయించారు. కాటన్ బ్యారేజ్ తూర్పు, మధ్య డెల్టాలోని కాలువల అభివృద్ధికి అధికారులు గతంలోనే రూ.70 కోట్లతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఈ బడ్జెట్లో ఆ ప్రస్తావన రాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల బాగుకు అరకొర నిధులే..

జిల్లాలో ఉన్న పలు రహదారులు గత వైసిపి ప్రభుత్వంలో అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్నిచోట్ల గుంతలను పూడ్చారు. దీంతో ప్రయాణికులకు కొంత ఉపశమనం కలిగింది. శాశ్వత ప్రాతిపదిక రహదారులను నిర్మించాలంటే పెద్ద ఎత్తున నిధులు అవసరం ఉంది. ఈ బడ్జెట్లో రహదారుల కోసం అరకొర నిధులను మాత్రమే కేటాయించడంతో ఉమ్మడి జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు.

మూడు జిల్లాల్లో సుమారు 250 కిలోమీటర్ల జాతీయ రహదారులు, 4,200 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్లు, 1100 కిలోమీటర్ల రాష్ట్ర రహదారులు, 6,500 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రోడ్లు ఉండగా 60 శాతానికి పైగా మరమ్మతులకు గురై ఉన్నాయి.

నిరుద్యోగులకు నిరాశ

ఆంధ్రప్రదేశ్‌లో నిరుద్యోగ రేటు 17.5 శాతం ఉండగా వారికి నిరుద్యోగ భృతి కోసం వార్షిక బడ్జెట్ లో కేటాయింపులు చేయలేదు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 3 లక్షల మందికి పైనే నిరుద్యోగులు ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాల కోసం గానీ, కనీసం నిరుద్యోగ భృతిపై గానీ కేటాయింపులు లేవు. ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున గొప్పలు చెప్పిన చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నిరుద్యోగుల సమస్యలను పట్టించుకోకపోవడం బాధాకరమని పలువురు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కార్మిక, శ్రామిక, మహిళ, ఉద్యోగుల ప్రయోజనాలు కరువయ్యాయి. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు పూర్తిస్థాయిలో నిధులను కేటాయించకపోవడం విస్మయకరమని రాజకీయ విశ్లేషకులు ఆవేదన చెందుతున్నారు. ఉదాహరణకు అన్నదాత సుఖీభవకు రూ.10,400 కోట్లు అవసరం కాగా 6,300 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రధానంగా నియోజకవర్గాలకు అభివృద్ధి నిధులు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగించింది.

కౌలు రైతులకు ఊతమేదీ..?

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు ఐదున్నర లక్షల మంది కౌలు రైతులు పంటలను సాగు చేస్తున్నారు. సాధారణ రైతుల మాదిరిగా రుణాలు, రాయితీలు, వడ్డీ మాఫీ పథకాలు, పంటల నష్టపరిహారం వంటి ప్రభుత్వ ప్రయోజనాలు వీరికి సక్రమంగా అందడం లేదు. అయినాకాడికి అప్పులు చేసి సాగు చేస్తున్నా పెట్టుబడి సొమ్ములు కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు కనీసం ఈ బడ్జెట్లో కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడం శోచనీయం. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మహిళలకు ఉచిత బస్సుకు ఊసెత్తలేదు. ప్రతినెలా మహిళకు రూ.1500 ఇస్తామన్న బడ్జెట్లో ప్రస్తావించలేదు.



నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

నేటి నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 43,331మంది పరీక్షలకు హాజరుకానున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 22,779 మంది కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,552 మంది ఉన్నారు. సిసి కెమెరాల నిఘా నడుమ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇన్విజిలేటర్లతో సహా ఎవరూ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లేందుకు అవకాశం లేదు. ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ పరీక్షలను నిర్వహించనున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షా కేంద్రానికి అనుమతించేది లేదని అధికారులు తెలిపారు. విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి వారు సూచిస్తున్నారు. ఆ దిశగా రవాణా ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాలోని సమస్యాత్మక కేంద్రాలు ఐదు ఉన్నాయి. ఈ కేంద్రాలలో పరీక్షల నిర్వహణకు పోలీసు శాఖ సహకారంతో ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటర్లతో పాటు మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎక్కడికక్కడే సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

రూ. 27.93 కోట్ల ఇంటి పన్నుల వసూలు

ప్రజాశక్తి-కడియం



మాట్లాడుతున్న డిఎల్‌పిఒ నాగలత

రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో గల గ్రామపంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకు రూ.27.93 కోట్ల మేర ఇంటి పన్నులు వసూలు చేశామని డివిజన్ పంచాయతీ అధికారిణి ఎం.నాగలత తెలిపారు. కడియం మండలం జేగురుపాడు, పొట్టిలంకలో శుక్రవారం ఆమె పర్యటించారు. పలు ఫిర్యాదులపై విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. డివిజన్ పరిధిలో గల రాజమహేంద్రవరం రూరల్, కడియం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, గోకవరం మండలాల్లో 146 గ్రామపంచాయతీల నుంచి రూ.67.58 కోట్లు ఇంటి పన్నులు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికి వరకూ 41 శాతం వసూలు చేశామన్నారు. నూరు శాతం వసూలు చేసేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎస్‌వి.రాంప్రసాద్, జేగురుపాడు, పొట్టిలంక గ్రామ కార్యదర్శులు ఎ.శ్రీనివాసరావు, అమీర్ షరీఫ్ తదితరులు ఉన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జిల్లాలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పలు విద్యాసంస్థల్లో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. సైన్సుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

రాజమహేంద్రవరం : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జెవివి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆనంద్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు వై.ఫైడియ్య 'పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్తు తరాలు మనుగడ సాగించగలుగుతాయన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. అధ్యక్షులు భీమయ్య మాట్లాడుతూ సైన్స్ మానవ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందన్నారు. నేడు ఎఐ వంటి సాంకేతికతను ప్రజలకు అందించిందని గుర్తు చేశారు. ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు మాట్లాడుతూ నిరూపించబడిన అంశాలను మాత్రమే ప్రజలు విశ్వసించాలన్నారు. ఊహాజనితమైన అశాస్త్రీయమైన అంశాలను ప్రజలు విడనాడి శాస్త్రీయ దక్పథంతో జీవించాలని పిలుపునిచ్చారు. సీనియర్ నాయకులు చెక్క తాతారావు మాట్లాడుతూ రాజ్యాంగంలోని 51ఎ ఆర్టికల్ భారత ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని కలిగి ఉండాలని తెలియజేస్తుందన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం ఎస్.రవికుమార్, జెవివి గౌరవ అధ్యక్షులు వై.ఫైడియ్య, నాయకులు శిరోమణి తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్స్ కళాశాలలో...

ఆర్ట్స్ కళాశాలలో...

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కళాశాలలో సివి.రామన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా ఛీఫ్ సైంటిస్ట్ కె.చంద్రశేఖరనాయుడు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడుతూ రామన్ చేసిన సేవలను కొనియాడారు ఆసియా ఖండంలోనే సివి.రామన్ మొదటిగా నోబెల్ బహుమతిని పొందారాని గుర్తు చేశారు. కళాశాలలో రామన్ సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించి రీసెర్చ్ ప్రాజెక్టులను అందిస్తూ వారికి నగదు ప్రోత్సాహకంతో ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఛీఫ్ సైంటిస్ట్ చంద్రశేఖరనాయుడు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో సైన్స్ పాత్రను వివరించారు. శాస్త్రీయ దృక్పథంపై మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులను అందించారు. విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్‌పై పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త రసాయన శాస్త్ర విభాగాధిపతి టి.శ్రీనివాసరావు ఇతర సైన్స్ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లాలాచెరువు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్సు ప్రాజెక్టులు ప్రదర్శించారు. హెచ్‌ఎం అంకం మల్లేశ్వర రావు మాట్లాడుతూ విద్యార్థులందరూ శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం విజేతలకు పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ కే.రమేష్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.

ఆర్యపురం శ్రీచైతన్య పాఠశాలలో విజ్ఞాన ప్రదర్శన నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జైళ్ల పర్యవేక్షణాధికారి రంగస్వామి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్ర ఎగ్జిక్యూటివ్ ఎజిఎం ఎంవి.సురేష్, రాజమండ్రి సిటీ రీజినల్ ఇన్‌ఛార్జి ఉదయ్‌శంకర్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం : ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కెఎస్‌కె.మాణిక్యాలరావు మాట్లాడారు. మహనీయులు అందించిన సైన్స్ ఆవిష్కరణలను స్ఫూర్తిగా తీసుకొని, ప్రతి విద్యార్థి విజ్ఞాన శాస్త్రం పట్ల అవగాహనతో కొత్త కొత్త ఆవిష్కరణ వైపు ప్రయాణించాలన్నారు. అప్పుడే దేశ, ప్రపంచ పురోగతి సాధ్యమవుతుందన్నారు. కాల్దరి ఎంపిపిఎస్ నెంబర్-3 పాఠశాలలో విద్యార్థులకు సైన్స్ వల్ల కలిగే ఉపయోగాలు, అభివృద్ధి చెందుతున్న సైన్స్ గురించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా కుసుమ టీచర్ అవగాహన కల్పించారు. నిరుపయోగ వస్తువులతో తయారు చేసిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. మోర్త ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వేలివెన్ను కాంప్లెక్స్ సెక్రటరీ గణేష్, హెచ్‌ఎం సుభద్రాభాను, మోర్త శ్రీనివాస్, హేమలత, శివప్రసాద్, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ మాధవి, కోటి మాణిక్యం, అరుణకుమారి, తంగిరాల రామ శేషేంద్ర, గోపాలకష్ణ, ఎం నాగమణి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి : చిన్నారుల్లో దాగివున్న సృజనాత్మకకు సైన్సు ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంఇఒలు బాలామణి, నెహ్రూజీ అన్నారు. శుక్రవారం వేగేశ్వరపురం కెఎస్‌ఆర్‌జిహెచ్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన నిర్వహించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు సుభాషిణి, నాగరత్నం, భవాని, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. బల్లిపాడు జెబి పాఠశాలలో హెచ్‌ఎం జివికే రాజు ఆధ్వర్యంలో సైన్ దినోత్సవాన్ని నిర్వహించారు.

గోపాలపురం: విద్యార్థుల్లో మేధాశక్తిని పెంపొందించేందుకు సజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని బాపూజీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించామన్నారు.

కడియం : విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలని, శాస్త్రవేత్తలుగా తయారవ్వాలని కడియం ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం షేక్ రఫీయుద్దీన్ అన్నారు. పాఠశాలల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో రఫీయుద్దీన్ అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. స్టాఫ్ కార్యదర్శి గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సైన్స్ పరిశోధనలో పాఠశాల ముందడుగు వేయాలన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు.

రాజానగరం : సమాజ శ్రేయస్సు కోసం విజ్ఞానం వైపు అడుగులు వేయలని నన్నయ యూనివర్శిటీ విసి ఎస్.ప్రసన్నశ్రీ విద్యార్థులకు సూచించారు.



నన్నయ యూనివర్శిటీలో రామన్‌కు నివాళులర్పిస్తున్న విసి తదితరులు

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నేషనల్ సైన్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విసి ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ జి.సుధాకర్, కోస్తాంధ్రా రేంజ్ డిఐజి ఎంఆర్.రవికిరణ్, సిఎస్‌ఐఆర్-ఐఐసిటి ఛీఫ సైంటిస్ట్ డాక్టర్ చంద్రశేఖరర, ప్రిన్సిపల్ డాక్టర్ పి.విజయనిర్మల, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ ఆచార్య వై.శ్రీనివాసరావు హాజరయ్యారు. తొలుత విసి జ్యోతిప్రజ్వలన చేసి నన్నయ విగ్రహానికి, సర్ సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి ప్రసన్నశ్రీ మాట్లాడారు. వికసిత్ భారత్ కోసం సైన్స్ అండ్ ఇన్నోవేషన్‌లో విజన్ -2047తో ముందుకు సాగాలన్నారు. సుస్థిర వృద్ధి, ఆర్థిక పురోగతి, జాతీయ శ్రేయస్సును నడపడం సైన్స్ అండ్ టెక్నాలజీలో ఒక సవాలుగా భావించాలన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రోబోటిక్స్, స్పేస్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, పరిశ్రమలను విప్లవాత్మకంగా మారుస్తున్నాయన్నారు. జాతీయ భద్రత, అంతరిక్ష పరిశోధనలను బలోపేతం చేయడం, రక్షణలో పురోగతి సాధిస్తున్నామని చెప్పారు. సాంకేతికత, సైబర్ భద్రత, ఏరోస్పేస్ పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. పునరుత్పాదక శక్తి, హరిత సాంకేతికతలు వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, పర్యావరణ అనుకూల పారిశ్రామిక ప్రక్రియలవైపు అడుగులు వేయాలన్నారు. సర్ సివి.రామన్, అబ్దుల్ కలామ్ వంటి సైంటిస్టులతో పాటు ఇకె.జానకిఅమ్మాళ్, బి.విజయలక్ష్మి, ఎ.ఛటర్జీ, ఆనందీబాయిజోషి, ఇరావతి కార్వే, అన్నామణి, కల్పనా చావ్లా వంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డిఐజి ఎంఆర్.రవికిరణ్ మాట్లాడుతూ సినిమాలను సినిమాల్లాగే చూడాలన్నారు. నిజజీవితంలో వాటిని అన్వయించుకోకూడదన్నారు. ఒత్తిళ్లను అధిగమించి ముందుకు సాగాలని చెప్పారు. ఈజీ మనీ కోసం ఆశపడరాదన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జి.మురళికృష్ణ, డాక్టర్ కె.నూకరత్నం రాసిన 'స్పాటియల్ అనాలసిస్ అండ్ జియో విజువలైజేషన్' పుస్తకాన్ని విసి ఆవిష్కరించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కెమిస్ట్రీ విద్యార్థి బద్రీ వేసిన సివి.రామన్, అబ్దుల్ కలామ్ చిత్రపటాలను విసి ఆవిష్కరించి అభినందించారు.

కార్టూ'నిజం'



ప్రాంతీయ భాషలను మింగేస్తున్న హిందీ

టైలర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

చేతి వృత్తిదారులను ఆదుకోవాలని శ్రీరాములు టైలర్స్ కోఆపరేటివ్ సొసైటీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. టైలర్స్ డే సందర్భంగా శుక్రవారం సంఘం సభ్యులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి విలియమ్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు ఎం.సుబ్బారావు, సెక్రటరీ బి.రాజారావు మాట్లాడారు. ఆన్‌లైన్ కొనుగోలు విధానం రావడంతో వృత్తిదారులకు ఉపాధి కరువైందన్నారు. కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. టైలర్స్‌ను ఆదుకోవాలని కోరారు. టైలర్లకు ప్రత్యేక పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. అనంతరం స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు రాగిరెడ్డి ఆంజనేయులు, జుత్తుగ వెంకటేశ్వరరావు, సిహెచ్.సత్తిబాబు, కె.రాజబాబు, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

తాళ్లపూడి : స్థానిక మదన గోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో టైలర్స్ డేను నిర్వహించారు. టైలర్స్ సంఘం మండల అధ్యక్షులు ఒంబోలు పోసిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్‌హో చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడీమేడ్ వస్త్రాలతో టైలర్లకు ఉపాధి కరువైందన్నారు. తమను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ వై.సుబ్రహ్మణ్యం, జి.రామాంజనేయులు, పి.గాంధీ, కె.కిషోర్, రవి తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో నిర్వహించిన టైలర్స్‌డేలో పాల్గొన్న టైలర్లు

గోపాలపురం : గోపాలపురంలో టైలర్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విలియమ్స్ హో చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టైలర్ల పరిస్థితి నేడు దయనీయంగా మారిందన్నారు. వారిని ఆదుకోవాలన్నారు. టైలర్ల హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలములోని పలువురు టైలర్లు పాల్గొన్నారు.

గోకవరం : మండలంలోని కొత్తపల్లిలో టైలర్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వర ప్రాథమిక టైలర్స్ సహకార సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో రామాలయం వద్ద నిర్వహించారు. విలియం హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు యర్రా రత్నాజీరావు, కార్యదర్శి బడిగంటి సూర్యప్రకాశరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కొమ్మన వెంకటరమణ, కొల్లు దుర్గారావు, ఏనుగు రాణి పాల్గొన్నారు.

రీ సర్వేపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం దుళ్ల గ్రామంలో జెసి ఎస్.చిన్నరాముడు ఆధ్వర్యంలో శుక్రవారం సమగ్ర భూ సర్వేపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. భూమి కలిగిన ప్రతి ఒక్కరూ తమ భూమి స్థితిగతులను తెలియజేసే దస్తావేజుల వివరాలు తెలుపుతూ సర్వే చేయించుకోవాలని రైతులను కోరారు. జిల్లా ల్యాండ్ ఆఫీసర్ బి.లక్ష్మీనారాయణ, తహశీల్దార్ సునీల్‌కుమార్, మండల సర్వేయర్ భువనేశ్వరి, వివిధ గ్రామాల సర్వేయర్లు, గ్రామకార్యదర్శి బి.మహేష్, విఆర్‌ఒ బుజ్జమ్మ, రైతులు ముమ్మిడిదేవి నాగేశ్వరరావు, కంటిపూడి శ్రీనివాస్, కంటిపూడి సత్యనారాయణ, చిట్టూరి వెంకన్న చౌదరి తదితరులు పాల్గొన్నారు.





కాశయ్య దంపతులను సత్కరిస్తున్న సిబ్బంది

డిపిఆర్‌ఒ కాశయ్య ఉద్యోగ విరమణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

డిపిఆర్‌ఒ కాశయ్య శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆనం కళాకేంద్రంలోని సర్వారాయ కళామందిరంలో సమాచార శాఖ సిబ్బంది శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు. కలెక్టర్ పి.ప్రశాంతి కాశయ్య దంపతులను క్యాంపు కార్యాలయంలో సన్మానించారు.కాశయ్య సేవలు అభినందనీయమని ప్రశంసించారు. జెసి చిన్నరాముడు, డిఆర్‌ఒ టి.సీతారామమూర్తి మాట్లాడుతూ జిల్లా యంత్రాంగానికి పాత్రికేయవర్గానికి వారధిగా కాశయ్య విలువైన బాధ్యతలు నిర్వహించారన్నారు. ఈ సందర్భంగా కాశయ్య దంపతులను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక, సన్మాన పత్రం అందజేశారు. పలువురు పాత్రికేయులు, సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది, విలేకర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో శనివారం నుంచి జరిగే ఇంటర్ మీడియట్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా పలు కేంద్రాలను అధికారులు పరిశీలించారు.

తాళ్లపూడి : ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని వేగేశ్వరపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గౌరీనాథ్ తెలిపారు. ఈ కేంద్రంలో జరగనున్న మొదటి సంవత్సరం 325 మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 260 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలతో పాటు అన్ని వసతులు కల్పించామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో కళాశాల విద్యార్థులతో పాటు అన్నదేవరపేట ప్లస్2 విద్యార్థులు, క్రీ బండి కళాశాల, విశ్వాసం కళాశాల విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. డిపార్ట్ మెంటల్ ఆఫీసర్‌గా డి.శ్రీనివాసరావు వ్యవహరిస్తారన్నారు. పరీక్షలకు అరగంట ముందుగా విద్యార్థులు హాజరు కావాలని సూచించాడురు.

గోపాలపురం : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం నుంచి ప్రారంభమవుతున్నాయని, దీని కోసం అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని ఎగ్జామ్స్ సెంటర్ల ఛీఫ్ సూపరింటెండెంట్లు శుక్రవారం తెలిపారు. గోపాలపురం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల, శ్రీ గౌతమి జూనియర్ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం వారికి మార్చి ఒకటి నుంచి 13 వరకూ పరీక్షలు జరుగుతాయన్నారు. ఒకేషనల్ కోర్సువారికి 17 వరకు పరీక్షలు ఉంటాయన్నారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మొదటి సంవత్సరం తెలుగు, సంస్కృతం పరీక్షకు 310 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. గౌతమి జూనియర్ కళాశాలలో 287 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష కేంద్రానికి 30 నిమిషాల ముందుగానే హాజరుకావాలన్నారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు జరగుతాయని తెలిపారు. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 320 మంది, శ్రీగౌతమి జూనియర్ కళాశాలలో 235 మంది సీనియర్ ఇంటర్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.


సిబ్బందికి సూచనలు ఇస్తున్న అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు

సీతానగరం : ఇంటర్ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలను అడిషనల్ ఎస్‌పి ఎవి.సుబ్బరాజు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. పోలీసు శాఖ నుంచి ఒక ఎఎస్‌ఐ, రెవెన్యూ శాఖ నుంచి ఒక డిప్యూటీ తహశీల్దార్, సీనియర్ లెక్చరర్‌తో కూడిన ముగ్గురు సభ్యులతో రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించారని తెలిపారు. పరీక్ష కేంద్రంలో సిసి కెమెరాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు, షాపులు తెరవరాదన్నారు. పరీక్షా కేంద్రానికి 200 మీటర్లు దూరంలో ఎవరు ఉండకూడదన్నారు. సెల్ ఫోన్‌లు, క్యాలిక్యులేటర్లు, ఇతర డిజిటల్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించేది లేదన్నారు. సిబ్బంది సైతం పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. ఇంటర్ బోర్డు అందించిన కీప్యాడ్ ఫోన్‌లను మాత్రమే సూపరింటెండెంట్ తీసుకెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. ఆయన వెంట కోరుకొండ సిఐ సత్యకిషోర్, సీతానగరం ఎస్‌ఐ రామ్‌కుమార్, హెచ్‌సి శ్రీనివాస్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మొండి చేయి

ప్రజాశక్తి - తాళ్లపూడి

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్లో ఉద్యోగులకు మొండిచేయి చూపిందని గోపాలపురం తాలూకా జెఎసి చైర్మన్ జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం బకాయిలు పడ్డ డిఎ, పిఆర్‌సి ఊసే లేదన్నారు. రెండేళ్లుగా ఎదురుచూస్తున్న సాధారణ బీమా మెచ్యూరిటీ క్లెయిమ్స్‌కు నిధులు కేటాయించ లేదన్నారు. పిఎఫ్ లోను, ఫైనల్ పేమెంట్లకు నిధులు కేటాయించ లేదన్నారు. మధ్యంతర భృతి,. ఐఆర్ ప్రకటనే లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం మరోసారి పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు.

నేరాలు ఘోరాలు

యువకునికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటార్ సైకిల్ పై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొన్న ఘటనలో ఒక అతను తీవ్ర గాయాల పాలైయ్యాడు. శుక్రవారం దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అయినాపురానికి చెందిన ఇళ్ళ సూర్య వెంకట నాగమల్లేశ్వరరావు మామిడికుదురు జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం మోటార్ సైకిల్‌పై ఇంటికి వస్తుండగా బొండాయి కోడు తూము వద్ద అతనిని ఆటో ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన నాగమల్లేశ్వరరావు ను కాకినాడలోని ఒక ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. నాగమల్లేశ్వరరావును ఢీ కొట్టి ఆటోతో పరారైన ఆటో డ్రైవర్ ను ముమ్మిడివరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీనిపై ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సవరపాలెం ఆలయంలో చోరీ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

మండలంలోని సవరపాలెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో చోరీ జరిగిందని శుక్రవారం అమలాపురం పోలీసులకు ఆలయ అర్చకులు దొంతుకుర్తి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. 8 కిలోల వెండి ఆభరణాలు చోరీ అయినట్లు ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు తాలూకా ఎస్ఐ వై.శేఖర్ బాబు, తాలూకా పోలీసులతో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి డాగ్ స్క్వాడ్‌తో చుట్టుపక్కల ప్రాంతాలలో దర్యాప్తు చేపట్టారు.

యానాం వార్తలు

ఘనంగా సైన్స్ దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాంలోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మెట్టకూరు రీజెన్సీ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు ప్రధానోపాధ్యాయులు టివిఎస్ఎస్‌వి ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు విద్యార్థులు శాస్త్రవేత్తల వేషధారణలో అలరించారు. సైన్స్ నమూనాలను, శాస్త్రవేత్తల ఫోటోలను ప్రదర్శించారు. విద్యార్థులకు పలు అంశాలలో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇన్చార్జ్ సిహెచ్.వీరభద్రం, ఉపాధ్యాయులు కె.క్రాంతి కుమార్, సిహెచ్.అశ్విని, పివి.వరలక్ష్మి, ఎం.ఉష రామలక్ష్మి, ఎం.రహిమా, ఐ.భాస్కరమని పాల్గొన్నారు. స్థానిక నల్లం రెసిడెన్షియల్ కాన్సెప్ట్ స్కూల్లో చైర్మన్ నల్లం నాగబాబు ఆధ్వర్యంలో జాతీయ సైన్స్ వేడుకలు ఘనంగా జరిగాయి.

ఘనంగా టైలర్స్ డే..

ప్రజాశక్తి - యానాం

శ్రీవిఘ్నేశ్వర టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డే 30వ వార్షికోత్సవాన్ని స్థానిక బెజవాడ గార్డెన్స్‌లో అగ్నికుల క్షత్రియ కళ్యాణ మండపంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్ఎఒ మునిస్వామి పాల్గొన్నారు. పలువురు వక్తలు టైలర్స్‌ను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ తిక్కిరెడ్డి సత్యానందం మాట్లాడుతూ టైలర్స్ సంఘం అభివృద్ధికి పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు రూ.2 లక్షలు ఇచ్చారన్నారు. ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస అశోక్ రూ.2 లక్షల 25 వేలు ఇచ్చారన్నారు. సంఘ సభ్యులకు 5 కుట్టుమిషన్లు, అనారోగ్య బారిన పడిన టైలర్ రాచకొండ శ్రీనివాసరావుకు రూ.25 వేలు ఆర్థిక సహాయం అందించారన్నారు. సంఘ సభ్యులు నేమాల లక్ష్మీనారాయణ కనకాలపేట గ్రామ శివారులో 100 చదరపు మీటర్ల స్థలాన్ని సంఘానికి విరాళంగా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో డిటి జ్యోతి వెంకటేశ్వరరావు, మాజేటి సత్యభాస్కర్, నల్లా వెంకన్న, మల్లాడి విష్ణుమూర్తి, చిక్కం కృష్ణారావు, శ్రీనివాసరావు, కన్నాజి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ స్థలంపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - యానాం

యానాం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని మున్సిపాలిటీకి చెందిన 664 మీటర్ల స్థలం మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావుకు అమ్మడం సరికాదని,ఆ స్థలాన్ని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి దఖలు పరచాలని కోరుతూ పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాష్ నాథన్‌కు ఫిర్యాదు చేసినట్టు మాజీ ఎంఎల్ఎ వెలగా రాజేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సంబంధిత స్థలం 500 ఏళ్లుగా దేవస్థానం ఆధీనంలోనే ఉందన్నారు. ఇప్పటి వరకు ఆ స్థలాన్ని వాహనశాలగా ఉపయోగించినట్టు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు ఆ స్థలం అవసరం అన్నారు. ఆ స్థలం అమ్మడం సరికాదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన కాపీలను పుదుచ్చేరి లోకల్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి, పుదుచ్చేరి హెచ్ఆర్ఐ కమిషనర్‌కు పంపినట్టు తెలిపారు.

రేషన్ సరుకుల పంపిణీ సక్రమంగా చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

రేషన్ సరుకులను లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని అధికారి నాగాంజనేయులు ఎండియు ఆపరేటర్లకు సూచించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లాలోని ఎండియు ఆపరేటర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగంజనేయులు మాట్లాడారు. ఎండియు ఆపరేటర్లు రేషన్ సరుకులు డెలివరీ సమయములో రేషన్ సరుకుల ధర కంటే ఎక్కువ ధర వసూలు చేయడాన్ని నిలిపేయాలన్నారు. వారి వారి పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి రేషన్ సరుకులను లబ్ధిదారులకు అందించాలని సూచించారు. ప్రతి రైస్ కార్డు దారునకు రేషన్ సరుకులే అందేలా చూడాలన్నారు. రేషన్ సరుకులు డెలివరీ సమయంలో ఎండియు ఆపరేటర్లు విధిగా వేయింగ్ మెషిన్ తూకం వేసి ఇవ్వాలన్నారు. తూకం విషయం లో ఎటువంటి అవకతవకలు లేకుండా రేషన్ సరుకులు సరఫరా చేయలన్నారు. నిబంధనలను అతిక్రమించిన ఎండియు ఆపరేటర్లపై తీవ్రమైన క్రమ శిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఐవిఆర్ఎస్ సర్వే ద్వారా ఫిర్యాదులు అందిన ఎండియు ఆపరేటర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. వారి వివరణ ఆధారంగా చర్యలు ఉంటాయన్నారు. సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్లు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మహిళలు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని తద్వారా ఆర్థికంగా ఎదగాలని జిల్లా పరిశ్రమల అధికారి శివరామ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రం ఆత్రేయపురం వెలుగు కార్యాలయములో సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి సంబంధించి ఎంఎస్ఎంఇ ఉద్యమ రిజిస్ట్రేషన్ పై విఓఎలకు, సభ్యులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఎంపిడిఓ బికెఎస్ఎస్.వెంకట్రామన్ మాట్లాడుతూ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు ఎంఎస్ఎంఇలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలను అందించడం ద్వారా దేశం అభివృద్ధి చెంది, గ్రామీణ ప్రాంతాలను మెరుగు పరచడంలో కూడా సహాయపడతాయని తెలియజేశారు. పెట్టుబడి పరిమితి, నమోదు కోసం ప్రమాణాలు ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వాటిపై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ ప్రాసెసింగ్ సోసిటీ, డిఆర్‌పి టి.ఈశ్వరరావు, వెలుగు ఎపియం, ఆర్.యండి.గంగాధర్, పారిశ్రామిక వేత్తలు ఎం.వెంకట రాజు, ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

నీటి సరఫరా వేళల్లో మార్పు

ప్రజాశక్తి - నిడదవోలు

నిడదవోలు పట్టణంలో రంజాన్ మాసం సందర్భంగా మంచినీటి సరఫరా వేళల్లో మార్పు చేశామని మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి రెండవ తేదీ నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు మంచినీటి సరఫరా సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ మార్పును పట్టణ ప్రజలు గమనించాలన్నారు.

నేడు జాబ్ మేళా

గోపాలపురం : గోపాలపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని స్కిల్ హబ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ గణేష్, కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పదో తరగతి ఆపై విద్యార్హతలు కలిగిన వారు జాబ్ మేళాకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగులు ధ్రువపత్రాలతో జాబ్ మేళాకు హాజరుకావాలని కోరారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మహాశివరాత్రి సందర్భంగా గొల్లవిల్లి జడ్‌పి ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ఎస్ఆర్(అరిగెల శ్రీరంగయ్య) మెమోరియల్ డే అండ్ నైట్ జాతీయ వాలీబాల్ పోటీలు మూడో రోజు శుక్రవారం ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు మెన్ జాతీయ వాలీబాల్ పోటీలతోపాటు ఉమెన్ జాతీయస్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించడంతో ఉమెన్ వాలీబాల్ జట్ల మధ్య జరిగిన పోటీలు ఉత్కంఠాన్ని రేకెత్తించాయి. ఇండియన్ బ్యాంక్ (చెన్నై)-ఎంసిఒఇ (త్రివేండ్రం), ఇన్‌కంటాక్స్ (అహ్మదాబాద్-గుజరాత్), ఇన్‌కంటాక్స్-హూపర్స్-జిఎస్‌టి(ముంబై), బెంగళూరు- ఇన్‌కంటాక్స్(కేరళ)జట్ల మధ్య జరిగిన పోటీలు ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగాయి. క్రీడలను తిలకించేందుకు పెద్ద ఎత్తున క్రీడాభిమానులు రాజకీయ నాయకులు తరలివచ్చి వీక్షించారు. నాలుగు రోజులు పాటు నిర్వహిస్తున్న టోర్నమెంట్ విజయవంతానికి టోర్నమెంట్ గౌరవ అధ్యక్షులు ఎంఎల్ అయితాబత్తుల ఆనందరావు, టోర్నమెంట్ అధ్యక్షులు, జడ్‌పిటిసి మాజీ సభ్యులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి అరిగెల నరేష్,ముఖ్య సలహాదారు టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఉపాధ్యక్షులు మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు, సంయుక్త కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, గుత్తాల సుభాష్ చంద్రరావు, కోశాధికారి గనిశెట్టి తాతాజీ,సాంకేతిక సలహాదారు ఉండ్రు సుబ్బారావు(రాజబాబు), కార్యనిర్వాహక కార్యదర్శి, పీడీ గొలకోటి ఫణీంద్ర కుమార్ కార్యవర్గ సభ్యులు కృషి చేస్తున్నారు.



నేటి నుంచి గాలి కుంటు నివారణా టీకాలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలంలో అన్ని గ్రామాల్లో మార్చి 1 నుంచి 31వరకూ గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను వేస్తామని పశువైద్య శాఖ వైద్యులు డాక్టర్ యు.ముఖేష్ తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుని ఆయన తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

3వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మహాశివరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా తాళ్లపూడిలోని శివాలయం వద్ద శుక్రవారం 3వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జంధ్యాల గంగాధర శర్మ, జంధ్యాల అశ్విని మాట్లాడుతూ ప్రజల సహకారంలో ఆలయం వద్ద కార్తీక మాసం, మహాశివరాత్రి తదితర దినాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే భారీగా జరిమానాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

మోటార్ వెహికల్ చట్టంలో మారిన నిబంధనలు శనివారం నుంచి అమల్లోకి వస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారులు భారీగా జరిమానాలు కట్టాల్సి ఉంటుందని ఎస్ఐ టి.రామకృష్ణ తెలిపారు. హెల్మెట్ ధరించకపోతే గతంలో ఉండే జరిమానా రూ.100 నుంచి రూ.1000కి పెరిగిందన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.500 నుంచి రూ.5వేలు, ఇన్సూరెన్స్ లేకపోతే రూ.1000 నుంచి రూ.2వేలకు పెరిగిందన్నారు. పొల్యూషన్ సర్టిఫికెట్‌కు రూ.వేయి నుంచి రూ.15,00 వరకూ జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించి సక్రమంగా ప్రయాణించాలని సూచించారు.

'జిన్నూరి'కి ఘన సత్కారం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

డాక్టర్ వైఎస్ఆర్ హార్టీకల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు, నంగవరం సర్పంచ్ జిన్నూరి వెంకటేశ్వరరావు రెండోసారి వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షునిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయనను పలువురు నాయకులు ఘనంగా సత్కరించారు.నంగవరం లోని వెంకటేశ్వరావు నివాసంలో వెంకటేశ్వరావును సర్పంచ్ ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మునిపల్లి సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు, చినగాడవిల్లి వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షులు కామిశెట్టి ప్రభాకరరావు, పోలుమాటి రామకృష్ణ తదితరులు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పదవి ద్వారా వైసిపి బలోపేతానికి పార్టీ పూర్వ వైభవానికి కృషి చేసి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని వారు ఆకాంక్షించారు.


జిన్నూరిని సత్కరిస్తున్న చిన్నవరాజు తదితరులు

మైనార్టీల సంక్షేమానికి నిధుల కేటాయింపుపై హర్షం

ప్రజాశక్తి - కొత్తపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఎపి శాసనసభలో శుక్రవారం ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమాని రూ.5,434 కోట్ల నిధులను కేటాయించిన సిఎం నారా చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ మీరాన్ షరీఫ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు నాయకత్వంలో దేశంలోనే మొదటిసారిగా అత్యధిక నిధులను మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన రాష్ట్రంగా ఎపి నిలిచిందని షరీఫ్ తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఇంత భారీ బడ్జెట్ ని కేటాయించేందుకు కృషి చేసిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎమ్ఎమ్‌డి.ఫరూక్, ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎంఎ షరీఫ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

2న ఉచిత మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - అంబాజీపేట

అంబాజీపేట శ్రీ ఉషా క్లినిక్ బస్టాండ్ రోడ్డు నందు మార్చి2 న ఆదివారం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ఈ శిబిరం నందు (ఎముకలు దడత్వం పరీక్ష), న్యూరోపతి పరీక్ష (షుగర్ పేషెంట్స్, కాలిమంటలు, తిమ్మిర్లు, నరాల బలహీనత), మూడు నెలల స్థాయి షుగర్ స్థాయి పరీక్ష), షుగర్ పరీక్ష, యూరిక్ యాసిడ్ పరీక్ష, కీళ్ల నొప్పుల పరీక్షలు చేస్తారన్నారు. సుమారు రూ.4 వేలు విలువ గల సేవలు అందించబడునన్నారు. అపాయింట్ మెంట్ కొరకు 95501 46484 నంబర్ సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయం ప్రోత్సాహానికి చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలకు జిల్లాలోని రైతు బజార్లలో ప్రత్యేకంగా షాపుల ను కేటాయించి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలను ప్రోత్సహి ంచే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి, రానున్న ఖరీఫ్ సీజన్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించడానికి వ్యవసాయం, హార్టీకల్చర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారుల తో కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను ప్రదర్శించిన స్టాల్స్‌ను కలెక్టర్ పరిశీలించి రైతులు ఏ విధంగా ప్రకృతి వ్యవసాయం చేస్తు న్నారు. పాటిస్తున్న యాజమాన్య పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమావేశం లో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో 2024 -25 ఆర్థిక సంవత్సరం లో 92 గ్రామాల్లో 22399 మంది రైతులు 22586 ఎకరాల్లో పూర్తిగా లేదా పాక్షికంగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారన్నారు. వ్యవసాయంలో పురుగు మందులు, రసాయనాలు వాడటం ద్వారా భూమి కాలుష్యం అయ్యి పురుగుమందులు వాడిన ఆహారం తినడం మూలంగా ప్రజల ఆరోగ్యం దెబ్బతిం టుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా భూమి కలుషితం అవ్వకుండా ,ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా కాపాడవచ్చన్నారు. ఏటీఎం మోడల్ ద్వారా 20 సెంట్లు భూమిలో 15 నుంచి 20 రకాల ఆకుకూరలు, కూరగాయలు, దుంపలు ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించడం జరుగుతుందని ఇలా పండించడం ద్వారా ప్రతి వారం రూ.500 నుంచి రూ.800 వరకు రైతులకు ఆదాయం లభిస్తుందని వ్యవసాయ అధికారులు కలెక్టర్కు వివరించారు. జిల్లా లో 256 మంది ఎటిఎం మోడల్‌లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. రానున్న ఖరీఫ్ సీజన్లో గత సంవత్సరం కంటే ఎక్కువమంది ప్రకృతి వ్యవసాయాన్ని చేసేలా గ్రామ సంఘాలు, మండల సమాఖ్యల సమావేశాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ క్షేత్రస్థాయి సిబ్బంది అవగాహన కల్పించి ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎక్కువమంది రైతులు ప్రకృతి వ్యవసాయని చేపట్టేలా అధికారులు ప్రోత్సహించాలన్నారు. ప్రకతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను జిల్లాలోని రైతు బజార్లు అమ్ముకునేందుకు ప్రత్యేకంగా ప్రతి రైతు బజారులో ఐదు నుంచి పది షాపులు ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు కేటాయించాలన్నారు. ప్రతి గ్రామంలో 5 నుంచి 6 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా వాణిజ్య పంటలను పండించే విధంగా వ్యవసాయ ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని పాఠశాలలు సంక్షేమ వసతి గృహాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండ్లు, కూరగాయలు ఏ ఏ విధంగా పండించవచ్చునో సర్వే చేసి నివేదిక సమర్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు, పీడీ డిఆర్‌డిఏ డాక్టర్ శివ శంకర ప్రసాద్, రైతు సాధికార సంస్థ డిస్టిక్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.